
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

విజయనగరం
జిల్లా వార్తలు
బుధవారం 4 సెప్టెంబరు 2024

ఆ గ్రామాలకు వర్షాల్లేవ్



- ఎల్.కోట మండలంలోని కొన్ని గ్రామాలకు కానరాని వాన
- తుఫాన్ ప్రభావంతో జిల్లా అంతటా పడుతున్న వర్షాలు
- అక్కడ మాత్రం నేటికీ ఆయిల్ ఇంజన్ పెట్టి నాట్లు
- వరిపై ఆశలు వదులుకుంటున్న కొందరు రైతులు

● లక్కవరపుకోట మండలం కల్లేపల్లి గ్రామ పరిధిలో పొలాలకు నేల బావి నుంచి ఆయిల్ ఇంజన్‌తో తోడుతున్న నీరిది. ఇదేంటి బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి కదా ఇక్కడేంటి ఇలా అనుకుంటున్నారా? అవును జిల్లా అంతటా వర్షాలు కురిసి వరద నీరు పొంగిపొర్లుతుంటే అక్కడ మాత్రం వరి నాట్లు వేసేందుకు కూడా పొలాల్లో నీరు చేరలేదు. దీంతో ఆయిల్ ఇంజన్‌లతో తోడుకుంటున్నారు.

శృంగవరపుకోట, సెప్టెంబరు 3:

లక్కవరపుకోట మండల పరిధిలోని కళ్లేపల్లి గ్రామంతో పాటు రేగ, శ్రీరాంపురం, లచ్చింపేట, పోతనాపల్లి, నర్సంపేట, మసివానిపాలెం గ్రామాల్లో భిన్నమైన పరిస్థితి నెలకొంది. వర్షాలు కనీస స్థాయిలో కురవక వరిపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. వరినాట్లు స్థానంలో సరుగుడు, నీలగిరి మొక్కలు నాటుకుంటున్నారు. ఖరీఫ్ ప్రారంభమైన జూన్ నుంచి ఇంతవరకు ఈ గ్రామాల్లో వరి నాట్లు పడలేదు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. ఇక్కడి పరిస్థితుల వల్ల 70శాతం పొలాలు సరుగుడు, నీలగిరి తోటల పెంపకం వైపు మళ్లుతున్నాయి. ఈ గ్రామాలతో పాటు చందులూరు, మర్లాపల్లి, ఆర్.జీ పేట, గంగుబూడి వంటి గ్రామాల్లోనూ అరకొర ఉబాలే జరిగాయి. వచ్చే ఏడాది నుంచి వీరు కూడా సరుగుడు, నీలగిరి మొక్కలు నాటేందుకు చూస్తున్నారు. జిల్లాలో మూడు రోజుల పాటు ఎడతెరిపిలేకుండా వానలు పడ్డాయి. నదులు, వాగులు, వంకలు పొంగుతున్నాయి. పొలాలూ జలకళను సంతరించుకున్నాయి. ఈ గ్రామాల్లో మాత్రం నీరే కనిపించడం లేదు. మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుండడంతో ప్రస్తుతం పడిన వర్షాలకు చెరువు గుంతలు, బందలు, నేలబావుల్లో చేరిన అరకొర వర్షపు నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా పొలాలకు తోడుతున్నారు. ఇప్పటికే తామరాపల్లి గ్రామంలో వరి నాట్లు స్థానంలో 98శాతం భూముల్లో సరుగుడు, నీలగిరి మొక్కలు నాటేశారు. మిగిలిన గ్రామాలు కూడా ఇదే బాటను అనుసరిస్తున్నాయి.

● లక్కవరపుకోట మండలంలోనూ 31.2మీమీ వర్షపాతం నమోదైంది. ఏటా మండలంలో వర్షపాతం ఎక్కువగానే చూపిస్తున్నప్పటికీ ఆ గ్రామాల్లో మాత్రం వర్షాలు పడడం లేదు. ఏటా వరి పొలాలు బీటలు వారుతున్నాయి. చేతికి పంట అందక రైతులు నష్టపోతున్నారు. తాజాగా కురిసిన తుఫాన్ వర్షాలకు చెరువులు, బందలు, బావుల్లో కనీస స్థాయిలో నీటి నిల్వలు చేరలేదు. ఎన్నాళ్లీలా ఇబ్బందులు పడాలనుకున్నారో ఏమో.. గత రెండు, మూడు రోజుల నుంచి ఒకరిని చూసి మరొకరు వాణిజ్య పంటైన సరుగుడు, నీలగిరి పెంపకం వైపు మళ్లారు. పొలాల సమీపంలోని చెరువులు, బందలు, నేలబావుల్లో చేరిన కొద్దిపాటి వర్షపు నీటితో మొక్కలు నాటేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు ఈ గ్రామాల రైతులు నాలుగు కోట్ల మొక్కలను నర్సరీల నుంచి కొనుగోలు చేసినట్లు సమాచారం.

● సరుగుడు, నీలగిరి పంటలు ఐదేళ్లకు చేతికి వస్తాయి. ఎకరాకు రూ.4 నుంచి 5లక్షలు రాబడి వస్తుంది. అదే వరి పంట కూలీలు, సేద్యం ఖర్చులు ఎక్కువయ్యాయి. ఎకరాకు 30 బస్తాలలోపు ధాన్యం పండుతున్నాయి. పెట్టుబడి కూడా రావడం లేదు. రైతు కష్టం మిగలడం లేదు. ఏటా వరుణుడుకోసం ఎదురుచూడక తప్పడం లేదు. దీంతో వాణిజ్య పంటల వైపు మళ్లుతున్నారు.



● కళ్లేపల్లి గ్రామ పరిధిలోనే పొలంలో మంగళవారం నీలగిరి మొక్కలు నాటుతున్న దృశ్యమిది. ఏటా వర్షాల కోసం ఎదురుచూసి విసిగిపోయిన రైతన్న గత ఏడాది ఖరీఫ్ ముగిసే సమయంలో ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఒకసారి నాటితే ఐదేళ్లవరకు వర్షం కోసం నిరీక్షించే పనిలేదని, పెట్టుబడి పోను ఎకరాకు రూ.5లక్షల వరకు లాభం వస్తుందని తెలుసుకొని ఈ బాట పట్టాడు. ఇప్పటికే తామరాపల్లి గ్రామ రైతాంగం 98శాతం సరుగుడు, నీలగిరి మొక్కలను నాటేశారు.



చుక్క నీరు చేరని కల్లేపల్లి రామన్న చెరువు


మూడు ఎకరాల్లో సరుగుడు నాటుతున్నాను..



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. అంతటా వరి నాటేవాడిని. కొన్నేళ్లుగా సక్రమంగా వర్షాలు పడడం లేదు. పంట ఎండిపోతోంది. సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది. అందుకే ఈ ఏడాది నుంచి మూడెకరాల్లో సరుగుడు నాటుతున్నాను. ఎకరా పొలాన్ని మాత్రం తిండిగింజల కోసం ఉంచాను.

-జి.చిన్నబాబు రైతు, కల్లేపల్లి గ్రామం

సరుగుడు, నీలగిరితో లాభాలు..




సరుగుడు, నీలగిరి సాగుతో లాభాలు వస్తాయని తెలిసింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో వున్న ఓ పరిశ్రమ ఈ పంటను కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తోంది. ఏటా వరి పంటతో నష్టపోవడం ఇష్టం లేక ఈ ఏడాది నుంచి నాకున్న ఐదెకరాల్లో మూడింట సరుగుడు నాటుతున్నాను. రెండు ఎకరాలను వరి కోసం ఉంచాను. తిండి గింజలకోసమైనా కొంతమేర పండించక తప్పడం లేదు.

-కొండ్రుపు సత్యం, రైతు, లచ్చంపేట

ఆ గ్రామాల్లో నాట్లు పడుతున్నాయ్..

ఇప్పుడిప్పుడే ఈ గ్రామాల్లో వరి నాట్లు పడుతున్నాయి. వర్షాలు కురుస్తున్నా సరిపడా నీరు లేక చెరువులు, బందలు, నేలబావుల్లో నుంచి ఆయిల్ ఇంజన్‌లతో నీరు తోడుకుంటున్నారు. చందులూరు, మర్లాపల్లి చుట్టపక్కల గ్రామాల్లో ఉబాలు పూర్తయ్యాయి. గంగుబూడిలో సగం నాట్లు పడ్డాయి. కల్లేపల్లి, రేగ, పోతంపేట, నర్సంపేట, లచ్చంపేట గ్రామాల్లో వరి నాట్లు ఆలస్యంగా పడుతున్నాయి.

-ఎం.స్వాతి, మండల వ్యవసాయ అధికారి, లక్కవరపుకోట



మడ్డువలసలో ఐదు గేట్ల నుంచి నీటి విడుదల

వంగర, సెప్టెంబరు 3: మడ్డువలస రిజర్వాయర్ పరిసర ప్రాంతాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వేగావతి, సువర్ణముఖి నదుల్లో ప్రవాహం పెరిగింది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం ఒక్కసారిగా పైపైకి ఎగబాకింది. అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు ఐదు ప్రధాన గేట్ల నుంచి మంగళవారం 11 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జలాశయంలో చేరుతున్న ఇన్‌ఫ్లోను యథావిధిగా బయటకు పంపుతున్నట్లు ఏఈ నీతిన్ తెలిపారు.

రేపటి నుంచి భారీ వర్షాలు

- వరద ప్రమాదాన్ని ముందే గుర్తించాలి
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం



కలెక్టరేట్, సెప్టెంబరు 3: ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకూ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజినీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మడ్డువలస రిజర్వాయర్ ఇన్‌ఫ్లో ఇప్పటికే ఎక్కువగా ఉందని, అందువల్ల ఇప్పటినుంచే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మడ్డువలస ప్రభావిత గ్రామాల్లోనే వీఆర్‌వోలు రాత్రి పగలూ ఉండి ఇరిగేషన్ అధికారులను ప్రతి మూడు గంటలకోసారి సంప్రదించి రిజర్వాయర్ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకోవాలని చెప్పారు.

పునరావాస కేంద్రాలను ముందుగానే గుర్తించాలన్నారు. చత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాల్లో భారీ వర్షాలు ఉన్నాయని, రానున్న రెండు మూడు రోజుల్లో నాగావళి నదిలో తద్వారా తోటపల్లి కాలువల్లో ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో 39 గ్రామాలపై ఆ ప్రభావం ఉంటుందని చెప్పారు. భారీ వర్షాలు కారణంగా వరదులు సంభవిస్తే ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని చెప్పారు.

● పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచిగాను, పోషక విలువలతో కూడనదిగా ఉండాలని, అందుకు మెనూ అమలుపై దృష్టి పెట్టాలని అంబేడ్కర్ ఆదేశించారు. ఎంఈవోలు, పాఠశాల నిర్వహణ కమిటీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డీఈవో ప్రేమకుమార్ తదితరులు ఉన్నారు.

● భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయనికి నీటిని అందించేందుకు వాటర్ పైపులైన్ ఏర్పాటు చేయడానికి భూసేకరణ కోసం సంబంధిత రైతులతో కలెక్టర్ మంగళవారం మాట్లాడారు.

మోసాలే.. రికవరీ లేదు





- జిల్లాలో పుట్టగొడుగుల్లా చిట్‌ఫండ్, ఫైనాన్స్ సంస్థలు
- అకస్మాత్తుగా బోర్డు తిప్పేస్తున్న వైనం
- బాధితులుగా వేలాదిమంది ప్రజలు
- న్యాయం కోసం ఎదురుచూపు

● ముద్ర అగ్రికల్చర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కోఆపరేటివ్ సంస్థ రెండేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా కార్యాలయాలను తెరిచింది. రోజుకు రూ.30 నుంచి రూ.500 కడితే ఏడాది తరువాత కొంత మొత్తం డబ్బులను అదనంగా కలిపి అందిస్తామని ప్రకటించింది. మొదటి ఏడాది డబ్బులు సక్రమంగా చెల్లించడంతో నమ్మకం పెరిగి రెండో ఏడాది వేలాది మంది డిపాజిట్లు చేసేశారు. రోజువారీ కార్మికులు, చిరు వ్యాపారులు కలిపి జిల్లా వ్యాప్తంగా 2500 మంది ఖాతాదారుల నుంచి రూ.1.5 కోట్లు వసూలు చేసిన ఆ సంస్థ ఆకస్మికంగా బోర్డు తిప్పేసింది. అటు సెక్యూరిటీ డిపాజిట్ పేరిట ఒక్కో ఉద్యోగి నుంచి రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు వసూలు చేసింది. దీంతో ఆ సంస్థ ఉద్యోగులు సైతం బాధితులయ్యారు.

● రెండేళ్ల కిందట గుర్ల మండలంలో ఓ వలంటీరు పప్పుల చీటీల పేరిట రూ.5 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. కొందర్ని ఏజెంట్లుగా పెట్టుకొని నెల్లిమర్ల, గుర్ల, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలాల్లో భారీగా డిపాజిట్లు సేకరించింది. ఎంత మొత్తం కడితే అంతకు డబుల్ నిత్యావసరాలను సంక్రాంతి సమయంలో అందిస్తానని చెప్పి రూ.5 కోట్ల వసూలు చేసి చేతులెత్తేసింది. దీంతో బాధితులు లబోదిబోమన్నారు. వారిలో ఎవరికీ ఇంతవరకూ న్యాయం జరగలేదు.

రాజాం, సెప్టెంబరు 3: ప్రజలను మభ్య పెట్టి.. లేనిపోని ఆశలు కల్పించి.. వారి నుంచి గుట్టుగా వివిధ రూపాల్లో డబ్బులు వసూలు చేసే చాలా సంస్థలు గ్రామాల్లో నడుస్తూనే ఉన్నాయి. బోర్డు తిప్పేసిన వాటిలో కొన్నే బయటపడుతున్నాయి. బాధితులు కూడా మోసాలను సకాలంలో గుర్తించడం లేదు. డబ్బంతా మూటగట్టుకుపోయే వరకూ తేరుకోవడం లేదు. ఇందులో చిరుద్యోగులు, కార్మికులు, దినసరి కూలీలే ఎక్కువగా బాధితులవుతున్నారు. ప్రధానంగా మహిళలను టార్గెట్ చేసుకొని మోసాలు పెరుగుతున్నాయి. కష్టపడి సంపాదించినదంతా డిపాజిట్ల రూపంలో పెట్టి మూల్యం చెల్లించుకుంటున్నారు. ఆఖరులో తాము మోసపోయామని తెలిసి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మోసం చేసిన వారు ఐపీ పెట్టేస్తుండడంతో ఆ కేసులు కూడా నీరుగారిపోతున్నాయి.

అవగాహన లేమి

ఆర్థిక మోసాలపై గ్రామస్థాయిలో పూర్తిస్థాయి చైతన్యం రావడం లేదు. ప్రధానంగా ప్రజల నిరక్షరాస్యత, అవగాహన లేమిని ఆసరా చేసుకొని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీ వంటి అధికారిక సంస్థలు పొదుపు పథకాలు ప్రారంభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. అటు ప్రభుత్వరంగ సంస్థలు సైతం పొదుపు పథకాలపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నాయి. ఫలితంగా కొందరు అక్రమార్కులు అధిక వడ్డీ ఆశచూపి ప్రజలను మోసం చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా సంస్థలు

జిల్లా వ్యాప్తంగా చిట్ ఫండ్ ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించ కుండా ఏర్పాటవుతున్నాయి. వాస్తవానికి చిట్ ఫండ్, ఫైనాన్స్ సంస్థలకు అనుమతులు తప్పనిసరి. కొన్ని నిబంధనలకు లోబడి పనిచేయాల్సి ఉంటుంది. ఆర్బీఐ లేదా సెబీ అనుమతితోనే చిట్ ఫండ్ సంస్థలు డిపాజిట్లు సేకరించాలి. రోజువారి వసూళ్ల చేపట్టాలి. అది కూడా ముందే నిర్ణయించిన స్కీమ్ ప్రకారం, నిర్దేశించిన గడువు వరకే చేయాలి. అలా చేయడం లేదు. ఐదు సంవత్సరాలు ఇన్వెస్ట్ చేస్తే.. పదేళ్ల మొత్తాన్ని చెల్లిస్తామని.. రెట్టింపు వడ్డీ వస్తుందని నమ్మబలుకుతుండడంతో ప్రజలు కూడా ఆకర్షితులవుతున్నారు. ఏజెంట్లు ఊరికి వెళ్లి మరీ వసూలు చేస్తున్నారు. కొత్త ఇన్వెస్టర్ల దగ్గర వసూలు చేసిన మొత్తాన్ని పాత ఇన్వెస్టర్లకు సర్దుబాటు చేస్తున్నారు. ఒక్కోసారి లావాదేవీలు నిలిచిపోతే దుకాణం సర్దేస్తున్నారు. జిల్లాలో దాదాపు 1000 వరకూ చిట్‌ఫండ్ కంపెనీలున్నాయి. అందులో పదుల సంఖ్యలో వాటికే అనుమతులున్నాయి.

అంత వడ్డీ అసాధ్యం..

సాధారణంగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లో డిపాజిట్లు చేస్తే..7 నుంచి 9 శాతం వరకూ వడ్డీ లభిస్తుంది. అంతకంటే మించి ఇవ్వడం అంటే అది మోసం చేయడమే. చెప్పినప్పుడే అనుమానించాలి. రెండు, మూడు, ఐదేళ్లలో రెట్టింపు ఇస్తామన్న మాట అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. ఎవరైనా చిట్ కట్టాలని కోరితే సంబంధిత కంపెనీ రిజిస్టర్ అయ్యిందా లేదా అని గమనించాలి. ఏజెంట్లు చెప్పే మాటలు నిజమా కాదా అని ఆరా తీయాలి. మోసమని గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. సెబీకి చెందిన స్కోర్స్‌ప్లాట్ ఫారమ్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి

ఆర్థికపరమైన నేరాలు ఇటీవల పెరిగాయి. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. దళారులు, ఏజెంట్ల మాయ మాటలు నమ్మవద్దు. అధిక వడ్డీ ఆశచూపే వారి వలలో పడొద్దు. మోసం జరగక ముందే గ్రహించాలి. ఆ తరువాత పోలీసులను ఆశ్రయించినా.. రకరకాల కారణాలు చూపుతూ ఆర్థిక సంస్థల నిర్వాహకులు తప్పించుకుంటున్నారు. ప్రజలు ముందే మేల్కొంటే చాలా మంచిది.

- కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం



పోలీసులపై పనిభారం

- అరకొర సిబ్బందితో సతమతం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

విజయనగరం (ఆంధ్రజ్యోతి):

ఏటా 6500 పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, స్టేషన్లలో సిబ్బంది కొరత అన్నదే లేకుండా చూస్తామని, పోలీస్ శాఖలో వారాంతపు సెలవు మంజూరు చేస్తామని ఇలా ఎన్నో హామీలు ఇచ్చిన గత సీఎం జగన్ ఐదేళ్లలో ఒక్కటీ ఆచరణలో పెట్టలేదు. ఒకేఒక నోటిఫికేషన్ ఇచ్చారు. అది కూడా పూర్తిచేయలేకపోయారు. కూటమి ప్రభుత్వంపైనే నిరుద్యోగులు ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు సిబ్బంది కొరత వల్ల ఉన్న వారిపై పనిభారం పెరిగింది. నిబంధనల ప్రకారం పోలీస్ స్టేషన్‌లో 40 మంది సిబ్బంది ఉండాలి. ఎక్కడా 20కు మించి లేరు. పేరుకే మూడు షిఫ్టులు కానీ రెండు షిఫ్టుల్లో పనిచేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. పోలీస్ శాఖలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకూ మరో షిఫ్ట్ ఉంటుంది. అయితే ఉదయం షిఫ్ట్ చేసిన వారు మళ్లీ రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకూ చేయాల్సిందే. దీనినే రెండు షిఫ్టుల పద్ధతిగా పరిగణిస్తారు. సిబ్బంది లేకపోవడంతో రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ లెక్కన నెలలో విధిగా ప్రతిఒక్కరూ 15 రోజుల పాటు నైట్ షిఫ్టులు చేయాల్సి ఉంటుంది. దీంతో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నారు. రుగ్మతల బారిన పడుతున్నారు. అదనపు సిబ్బందిని నియమించి మూడు షిఫ్టులు కొనసాగిస్తే నెలకు పదికి మించి నైట్ డ్యూటీలు రావు. అది కూడా ప్రతి మూడు రోజులకు ఒకసారి నైట్ డ్యూటీ పడే అవకాశం ఉంది. వీక్లీఆఫ్‌లు సైతం తీసుకునేందుకు వెసులబాటు కలుగుతుంది.

● ఉమ్మడి జిల్లాను మూడు సబ్ డివిజన్ల పరిధిలో 10 సర్కిళ్లుగా విభజించారు. జిల్లా వ్యాప్తంగా 41 పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఒక సెంట్రల్ క్రైమ్ స్టేషన్, ఒక మహిళా పోలీస్‌స్టేషన్, ఒకటి ట్రాఫిక్, మరొక మెరైన్ పోలీస్‌స్టేషన్ ఉంది. అన్నింటా చాలీచాలని సిబ్బంది ఉన్నారు. పెరుగుతున్న విధులకు ఈ సిబ్బంది ఏ మూలలకూ చాలడం లేదు. దీంతో ఉన్నవారు షిఫ్టులు వేసుకొని విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర, అనారోగ్య సమయాలు, ఇంటి అవసరాలకు గంటల లెక్కనే సెలవు మంజూరవుతోంది. అత్యవసరం అయితే తోటి సిబ్బందితో సర్దుబాటు చేసుకోవాల్సిందే.

నిట్ ఆంధ్రలో పీహెచ్‌డీ



పశ్చిమగోదావరి జిల్లా-తాడేపల్లి గూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆంధ్ర)- విశ్వేశ్వరాయ స్కీమ్ కింద పీహెచ్‌డీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో 5 సీట్లు, పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో 2 సీట్లు ఉన్నాయి. రిటెన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు.

విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

అర్హత: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి అభ్యర్థులు ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. గేట్/నెట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లు/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్‌లు/ఇండస్ట్రీలలో కనీసం రెండేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి.

ఫెలోషిప్: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి మూడేళ్లు నెలకు రూ.43,750లు ఇస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ఈ-మెయిల్:** hdadmissions@nitandhra.ac.in
- **వెబ్‌సైట్:** www.nitandhra.ac.in

దిక్సూచి DIKSUCHI

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ), స్వీడన్‌లోని బ్లీకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'బీటెక్ & బీఎస్+ఎంఎస్' ఇంటర్నేషనల్ కొలాబరేటివ్ ప్రోగ్రామ్‌లో మిగిలిన సీట్ల భర్తీకి సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిని అనుసరిస్తారు.

జేఎన్‌టీయూఏలో ఐసీపీ సెకండ్ ఫేజ్

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. అభ్యర్థులు మొదటి మూడేళ్లు అనంతపురం జేఎన్‌టీయూలో, చివరి మూడేళ్లు స్వీడన్ బీటీహెచ్‌లో చదవాల్సి ఉంటుంది. నాలుగేళ్ల కోర్సు పూర్తయిన తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలు ఎంచుకోవచ్చు.

- సీఎస్ఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(సీఎస్ఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(కంప్యూటర్ సైన్స్), ఎంఎస్(కంప్యూటర్ సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్-ఏఐ&ఎంఎల్) చదవాల్సి ఉంటుంది.
- ఈసీఈ అభ్యర్థులు జేఎన్‌టీయూఏ నుంచి బీటెక్(ఈసీఈ); స్వీడన్ బీటీహెచ్ నుంచి బీఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), ఎంఎస్(ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-మెషిన్ లెర్నింగ్, సెన్సార్స్ అండ్ సిస్టమ్స్) చదవాలి.

మిగిలిన సీట్ల వివరాలు: కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ)లో 7 సీట్లు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ)లో 10 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. జేఈఈ మెయిన్స్ 2024 ర్యాంక్/ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్/ఇతర రాష్ట్రాల ఎంట్రెన్స్ ఎగ్జామ్‌ల స్కోర్లు ఉండాలి.

- **సెకండ్ ఫేజ్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

Infosys Foundation STEM Stars Scholarship Program

Description: An initiative by Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM (Science, Technology, Engineering, Mathematics) subjects.

Eligibility: Female students who are citizens of India and enrolled in the first year of their 4-year undergraduate course in the fields of engineering, medicine (MBBS), and other related STEM subjects at institutes of repute (NIRF accredited) are eligible.

- Applicants must have obtained admission into the identified colleges and must have completed their Class 12.
- The annual family income of the applicants from all sources must be less than or equal to 8 lakh.
- Candidates must not have availed other scholarships for the same expenses

Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to 1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.

Last Date to Apply: 15-09-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/ISTS2

SCHOLARSHIP ALERT

Nikon Scholarship Program

Description: An initiative of Nikon India Private Limited to financially support students from disadvantaged sections of society to pursue photography-related courses.

Eligibility: Open for Indian students who have completed Class 12 and are pursuing photography-related courses with a duration of three months or more. Annual family income (from all sources) should be less than INR 6 lakh.

Prizes & Rewards: Up to INR 1,00,000

Last Date to Apply: 20-10-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/NIKON12

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zqexLBVలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



20 నుంచి అక్కినేని చలనచిత్రోత్సవం

లెజండరీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఆయన చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్ (ఎఫ్.హెచ్.ఎఫ్) ఒక ప్రకటనలో వెల్లడించింది. అక్కినేని కుటుంబ సభ్యుల సహకారంతో నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్స్, పీవీఆర్ ఐనాక్స్ లతో కలసి 'ఏయన్నార్ 100- కింగ్ ఆఫ్ ద సిల్వర్‌స్క్రీన్' పేరుతో ఈ చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఫిల్మ్ మేకర్, ఎఫ్.హెచ్.ఐ. డైరెక్టర్ శివేంద్ర సింగ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక చేసిన అక్కినేని అద్భుత చిత్రాలు పదింటిని హైదరాబాద్, ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు నగరాలతో సహా 25 ప్రాంతాల్లో ప్రదర్శిస్తామని ఆయన వెల్లడించారు. ఇంతకుముందు అమితాబ్ బచ్చన్, దిలీప్‌కుమార్, దేవానంద్ చిత్రోత్సవాలను ఎఫ్.హెచ్.ఐ నిర్వహించినట్లు శివేంద్ర సింగ్ పేర్కొన్నారు.

వరద బాధితులకు సినీ ప్రముఖుల విరాళం



ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజానీకాన్ని ఆదుకునేందుకు పలువురు సినీ ప్రముఖులు ముందుకొచ్చారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు ప్రకటించారు.

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ. కోటి విరాళం ప్రకటించారు. బుధవారం సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్కు అందజేయనున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని అనుకున్నా, తన వల్ల సహాయ కార్యక్రమాలకు ఆటంకం కలగకూడదని ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు ఆయన చెప్పారు.

జూనియర్ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి చెరో రూ. 50 లక్షల చొప్పున మొత్తం రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. 'భారీ వర్షాల వల్ల జరిగిన నష్టం నన్ను కలచివేసింది, ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని ఎన్టీఆర్ చెప్పారు. మహేశ్ బాబు సైతం రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. వరదల్లో ముంపునకు గురైన ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాత ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ కలసి రెండు రాష్ట్రాలకు కలిపి రూ. 50 లక్షల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందిస్తున్నట్లు ప్రకటించారు. వీరితో పాటు హీరో సిద్ధు జొన్నలగడ్డ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. 30 లక్షల సాయాన్ని ప్రకటించారు. హీరో విష్వక్సేన్ రెండు రాష్ట్రాలకు చెరో రూ. 5 లక్షల చొప్పున సాయాన్ని ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి రూ. 10 లక్షలు, హీరోయిన్ అనన్య నాగళ్ల రూ. 5 లక్షల సాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైజయంతి మూవీస్ రూ. 25 లక్షలు ప్రకటించగా, నిర్మాత బన్నీవాస్ 'ఆయ్' చిత్రం వసూళ్లలో పాతిక శాతాన్ని ఏపీ వరద బాధితులకు విరాళంగా అందిస్తున్నట్లు తెలిపారు. సహాయనిధికి విరాళాలను ప్రకటించిన సినీ ప్రముఖులకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియాలో ధన్యవాదాలు తెలిపారు.

ఆ తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది



బాలకృష్ణ

'తాతమ్మ కల' చిత్రంతో చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి, యాభై ఏళ్ల నట జీవితాన్ని పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ సినీ స్వర్ణోత్సవం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి విదితమే. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'యాభై ఏళ్ల క్రితం మా నాన్నగారు నా నుదిటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. యాభై ఏళ్ల నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగు జాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను' అని చెప్పారు బాలకృష్ణ. రెండు తెలుగు రాష్ట్రాలను వరద ముంచెత్తుతున్న ఈ తరుణంలో ఆయన స్పందిస్తూ 'ఈ విపత్కర పరిస్థితుల్లో బాదాతప్త హృదయంతో నా బాధ్యతగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 50 లక్షలు బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. తెలుగు రాష్ట్రాల్లో అతి త్వరలోనే మళ్లీ సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని వెల్లడించారు.

నాన్నే నా హీరో



ఎనభైల దశకంలో బాలీవుడ్‌లో విలన్‌గా ఒక వెలుగు వెలిగిన శక్తి కపూర్ మంగళవారం తన 72వ పుట్టినరోజు సెలబ్రేట్ చేసుకున్నారు. ఎంతో మంది ఆయనకు అభినందనలు తెలిపారు కానీ కుమార్తె శ్రద్ధా కపూర్ ఇచ్చిన పొగడ్త శక్తికపూర్‌కు ఎంతో శక్తినిచ్చింది. మరికొన్నేళ్ల పాటు జీవించాలనే ఉత్సాహాన్ని కలిగించింది. తండ్రితో దిగిన సెల్ఫీని సోషల్ మీడియాలో పోస్ట్ చేసి 'నాన్నే నా హీరో. తండ్రి అండదండలు ఉంటే జీవితంలో ఏదైనా సాధించగలం' అని కామెంట్ పెట్టింది శ్రద్ధా. ఆమె నటించిన 'స్త్రీ 2' చిత్రం ఇప్పుడు వసూళ్ల పరంగా సంచలన రికార్డులు సృష్టిస్తూ దూసుకుపోతోంది.

వైరముత్తుపై పోరాటంలో వెనకడుగే లేదు



చిన్మయి శ్రీపాద

ఎన్ని బెదిరింపులు వచ్చినా, పరిశ్రమ బహిష్కరణ విధించినా వెరవకుండా దక్షిణాది చిత్రసీమలో 'మీటూ' ఉద్యమానికి చుక్కానిలా నిలిచారు ప్రముఖ గాయని, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి శ్రీపాద. కొన్నేళ్లుగా ఆమె సోషల్ మీడియా వేదికగా మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై తన పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో ఆమె మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళ పాటల రచయిత వైరముత్తు చేతిలో తాను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నానని, ఆ కేసులో తాను ఇంకా పోరాడుతూనే ఉన్నానని తెలిపారు. ప్రముఖ గీత రచయిత, పద్మ పురస్కార గ్రహీత, సంగీత నాటక అకాడమీ సహా పలు జాతీయ పురస్కారల విజేత అయిన సెలబ్రిటీ చేతిలో తాను వేధింపులకు గురయ్యానంటూ చిన్మయి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నాతో పాటు మరికొందరు మహిళలు స్వయంగా మీడియా ముందుకు వచ్చి నోరు విప్పినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. న్యాయం కోసం ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరుగుతున్నట్లు చెప్పారు. దీన్ని తమిళ సినీ పెద్దలందరి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని నిరసన వ్యక్తం చేశారు. వైరముత్తుకు తమిళనాడులోని రాజకీయ పార్టీల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లే ఇన్నేళ్లైనా తనకు న్యాయం జరగలేదని ఆమె ఆరోపించారు. అతను ఎలాంటి వాడో అందరికీ తెలిసిందే, అయినా ఆయనపై చర్యలు తీసుకోకపోగా నన్నే బలిపశువును చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'తమిళ చిత్ర పరిశ్రమ నా పై కక్ష గట్టింది. అప్పటి డీఎంకే నేత, ఇప్పటి బీజేపీ నాయకుడు.. డబ్బింగ్ యూనియన్ ప్రెసిడెంట్ రాధారవి నాపై బహిష్కరణ వేటు వేశార'ని చెప్పారు. 'మెజారిటీ తమిళ సమాజం, నా తోటి సంగీత కళాకారులు సైతం తప్పంతా నాదే అన్నట్లు దుర్భాషలాడారు. అయినా వెనకడుగు వేయకుండా, వైరముత్తు వేధింపులపై ఇంకా పోరాటం చేస్తూనే ఉన్నాను. మున్ముందూ ఇది కొనసాగిస్తాను' అని చిన్మయి చెప్పారు.

'ప్రేమమ్' హీరోపై అత్యాచారం కేసు



జస్టిస్ హేమ కమిటీ నివేదిక నేపథ్యంలో పలువురు మాలీవుడ్ ప్రముఖులపై వరుసగా అత్యాచార కేసులు నమోదవుతున్నాయి. తాజాగా 'ప్రేమమ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటుడు నివిన్ పోలీపై అత్యాచారం కేసు నమోదైంది. ఓ నటి ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనను దుబాయ్ తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ప్రాథమిక విచారణ పూర్తి చేసిన పోలీసులు నివిన్ సహా మరో ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు.

తప్పుగా అర్థం చేసుకున్నారు

తమిళ అగ్రహీరో రజనీకాంత్‌ను 'జస్టిస్ హేమ కమిటీ గురించి మీ అభిప్రాయం చెప్పండి' అని మీడియా కోరగా, 'దాని గురించి నాకేం తెలియదు, క్షమించండి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే. దీనిపై కొంతమంది మీటూ ఉద్యమకారులు, నెటిజన్లు రజనీకాంత్ వైఖరిని తప్పుపట్టిన నేపథ్యంలో తమిళ నటి రాధికా శరత్‌కుమార్ ఆయన్ని వెనుకేసుకొచ్చారు. రజనీకాంత్‌కు నిజంగానే హేమ కమిటీ గురించి ఏమీ తెలియదనీ, అందుకే ఆయన దాని గురించి మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. ఆయన మౌనాన్ని ప్రజలు తప్పుగా అర్థం చేసుకోవడం బాధాకరమన్నారు.

కొత్తగా..

ఆడ లేడీస్ వర్సెస్ మగ జెంట్స్



శ్రీవిష్ణు హీరోగా నటించిన 'శ్వాగ్' చిత్రం విడుదల తేదీ ప్రకటించారు. హసిత్ గోలీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా దసరా పండగకు పది రోజుల ముందే అంటే అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ సినిమాతో శ్రీవిష్ణు మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఆయన సరసన రీతూ వర్మ నటించారు. సినిమాలో ఆడ లేడీస్, మగ జెంట్స్ మధ్య ఉండే ఆసక్తికరమైన కంటెంట్ అలరిస్తుందని శ్రీవిష్ణు, రీతూ వర్మ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.మీరా జాస్మిన్, సునీల్, దక్ష నగర్కార్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తుపాకులతో పోలీసు బందీ



సన్ని అఖిల్, గిద్దేష్ అజయ్ ఘోష్ తదితరులు నటించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'టైటిల్ లాగానే ఫస్ట్ లుక్ కూడా విభిన్నంగా ఉంది. సాధారణంగా ఎవరినైనా తాళ్లతోనూ, సంకెళ్లతోనో బంధిస్తారు. కానీ ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది' అని అభినందించారు. అభ్యుదయ చిత్రాల దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

● ఎస్పీ వకుల్ జిందాల్ ● బాధితులకు చెక్కులు అందజేత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 3: జిల్లాలో పనిచేస్తున్న పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ వకుల్ జిందాల్ భరోసా కల్పించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసుశాఖలో పనిచేసి ఇటీవల కాలంలో మరణించిన కానిస్టేబుల్, హోంగార్డుల కుటుంబాలకు పోగు చేసిన ఒక రోజు అలెవెన్సుని చేయూత కింద వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. హోంగార్డుగా పనిచేసి మరణించిన చిన్నోడు కుటుంబానికి చేయూతగా, హోంగార్డులు పోగు చేసిన ఒక రోజు అలవెన్సు రూ. 3 లక్షల 25,890 చెక్కును ఆయన సతీమణి రజనీకి అందజేశారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్య కారణంతో మరణించిన టీ గౌరీకుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన అడిషనల్ కార్పస్ ఫండ్ లక్ష రూపాయల చెక్కును ఆయన సతీమణి ఇందిరా వసంతికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, పోలీసు కుటుంబాలు తమ కుటుంబ యాజమానిని కోల్పోయి ఆర్థికంగా నష్టపోయిన సందర్భంలో వారికి ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందేంత వరకూ వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు పోలీసు ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొంత మొత్తాన్ని పోగు చేసి వారి కుటుంబాలకు చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు. ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, కార్యాలయ సూపరింటెండెంట్ ఏఎస్పీ ప్రభాకరరావు, ఆర్ఐలు రమేష్‌కుమార్, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు కుటుంబ సభ్యులకు చెక్ అందజేసిన ఎస్పీ వకుల్ జిందాల్

ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమస్యను పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

విజయనగరం దాసన్నపేట, కలెక్టరేట్: నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడం బాధకరమని ఏబీవీపీ నాయకులు బొబ్బాది సాయికుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిగ్రీ కళాశాల ఏర్పాటై ఏడేళ్లు అవుతున్నప్పటికీ, నేటీ వరకూ సొంత భవనం లేదని, తరగతి గదులే లేకుండా విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. సుమారు 300 మంది విద్యార్థులు వున్నటువంటి కళాశాలకు కేవలం రెండు గదులకే పరిమితం చేయడం, ఈ రెండు తరగతి గదులు కూడా ఎప్పుడు పెచ్చులూడుతాయో? భయంతో కళాశాలకు విద్యార్థులు వెళ్లడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరచి డిగ్రీ కళాశాల గురించి ఆలోచేన చేస్తారని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వంశీకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి తరం కోసం 'మన్యం ధీరుడు' సినిమా

బొబ్బిలి, సెప్టెంబరు 3: బొబ్బిలి కోటలో మంగళవారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామ రాజు ఉద్యమ నేపథ్యంగా చిత్రీకరించిన మన్యం ధీరుడు సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సినిమా ట్రైలర్‌ను ఎమ్మెల్యే బేబీనాయన విడుదల చేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుపై వచ్చే సినిమాలు సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. ఈ సినిమాలో అల్లూరిగా నటిస్తూ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఆర్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నేటితరం బాలబాలికలను విశేషంగా ఆకట్టుకునే రీతిలో ఈ చిత్రాన్ని రూపొందించామన్నారు. ఇప్పటి సాంకేతిక విలువలతో, నేటితరం ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా మన్యంధీరుడు రూపొంచినట్లు తెలిపారు. తెలుగుభాషకు జనాదరణ మరింతగా పెరిగేలా దేశభక్తి గేయాన్ని అద్భుతమైన పదజాలంతో ఈ సినిమాలో చూపిస్తున్నట్లు తెలిపారు. మన్యంధీరుడు సినిమా ఈ నెల 20న విడుదల చేస్తున్నట్లు ఆర్‌వీవీ వెల్లడించారు. ఈ సినిమాకు దర్శకత్వం డెక్కల నరేశ్ వహించగా, సంగీతాన్ని పవన్ చిప్పాడ సమకూర్చినట్లు తెలిపారు.


మన్యంధీరుడు సినిమా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తాగునీటి రిజర్వాయర్ దుస్థితిపై కదిలిన యంత్రాంగం

● ట్యాంకు శుభ్రం.. మున్సిపల్ ఏఈ, ఫిట్టర్‌కు చార్జిమెమోలు

బొబ్బిలి, సెప్టెంబరు 2: ప్రజారోగ్యంతో మున్సిపల్ అధికారులు చెలగాటమాడుతున్నారు.. దీనికి నిదర్శనమే స్థానిక తాగునీటి రిజార్వాయర్ అంటూ ఇటీవల తీవ్ర ఆరోపణలు వచ్చాయి. మున్సిపల్ తాగునీటి రిజర్వాయర్ లోపల విపరీతంగా నాచుపట్టి, అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉండడమే దీనికి సజీవ సాక్ష్యం అని, రెండు సంవత్సరాల నుంచి ఈ రిజర్వాయర్‌ను శుభ్రం చేయలేదని, 31 వార్డులకు సంబంధించి వేలాది మంది ఈ తాగునీటినే వినియోగిస్తున్నారని పలు విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బొబ్బిలి మున్సిపాలిటీ పనితీరుపై సొంతపార్టీకి చెందిన కోఆప్షన్ సభ్యుడు రియాజ్‌ఖాన్, 30వ వార్డు కౌన్సిలర్ భర్త వాడపల్లి మనోజ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడంతో యంత్రాంగం కదిలింది. వెంటనే సోమవారం ట్యాంకును అధికారులు శుభ్రం చేయించారు. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులను చేస్తూ మున్సిపల్ ఏఈ సురేష్, ఫిట్టర్ అప్పారావుకు కమిషనర్ రామలక్ష్మి మంగళవారం చార్జిమెమోలను జారీచేశారు. రిజర్వాయర్‌కు సంబంధించి ఆరోపణలు చేసిన వెంటనే పరిశుభ్రతా పనులు చేపట్టామని, షెడ్యూల్ ప్రకారం ఈఎల్ఎస్ఆర్‌లను శుభ్రపరుస్తున్నామని కమిషనర్ తెలిపారు. ప్రతిరోజూ పీహెచ్ లెవెల్స్, టీడీఎస్, బాక్టీరియా పరీక్షలను క్షేత్రస్థాయిలో చేయిస్తూ, ప్రతి నెలా ఒకసారి శ్యాంపిల్స్‌ను విశాఖ పంపించి పరీక్ష చేయిస్తున్నామన్నారు.


నాచుపట్టిన తాగునీటి రిజర్వాయర్, శుభ్రం చేసిన తర్వాత

● నాకు చార్జిమెమో ఇవ్వడం అన్యాయం

తాగునీటి సరఫరాకు సంబంధించి ఎన్నో ఏళ్లుగా ఎటువంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేకుండా సేవాభావంతో పనిచేస్తున్నా. నాకు చార్జిమెమో ఇవ్వడం ఎంతో బాధించింది. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాను బంద్ చేసి రిజర్వాయర్ పరిశుభ్రతా పనులు చేస్తే ఆందోళన పెరుగుతుంది. ఇప్పటికే పైపులైను లీకేజీలు అరికట్టడానికి ఇతరత్రా పనుల కోసం తాగునీటిని అప్పుడప్పుడు నిలుపుదల చేసినప్పుడు ప్రజలంతా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇలాంటి తరుణంలో నాలాంటి చిరుద్యోగిపై చర్యలు తీసుకోవడం బాధాకరం.

\- అప్పారావు, ఫిట్టర్

దేవుదళ కేజీబీవీ నిర్వహణపై ఆరా

రేగిడి: మండలంలో దేవుదళ కేజీబీవీ పాఠశాల/కళాశాలను మంగళవారం ఎంఈవో వరప్రసాదరావు, సంకిలి హైస్కూల్ స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్(హెచ్‌ఎం) రామినాయుడు తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో పాఠశాలల్లో ఫుడ్‌పాయిజన్ తరహా పలు సంఘటనలు జరగడంతో ఈపాఠశాల పరిస్థితులపై ఎంఈవో, సంకిలి హైస్కూల్ హెచ్‌ఎంలు ఆరాతీశారు. పాఠశాల నిర్వహణతీరును ప్రిన్స్‌పాల్ లక్ష్మితో సమీక్షించారు. అనంతరం ఇంటర్ ఒకేషనల్ కోర్స్(సీఎస్‌ఈ)లో కళాశాల టాపర్‌గా(467మార్కులు) నిలిచిన విద్యార్థి మహాలక్ష్మిని ఎంఈవో, సంకిలి హెచ్‌ఎంలు అభినందించారు.


దేవుదళ కేజీబీవీ వంటశాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

మట్టి వినాయక ప్రతిమలే వినియోగించాలి

రాజాం: కాలుష్య నివారణకు మట్టి వినాయక ప్రతిమలే వినియోగించాలని రాజాం నగర పంచాయతీ కమిషనర్ టి.రామప్పలనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని అమ్మవారికాలనీలో ఏఎంసీ సేవాసమితి అధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ఆయన ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు అర్నిపల్లి వెంకటనాయుడు, పెంకి గౌరీశ్వరరావు, కొత్తసాయి, ఆర్‌వీజీ నాయుడు, లెంక శ్రీహరి, బాబ్జి శ్రీనివాసరావు, పెంకి చైతన్యకుమార్, జి.అప్పలనాయుడు, సతీష్, వాసు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిమలను అందచేస్తున్న కమిషనర్

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. మంగళవారం దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పదో తరగతి కీలకమని వారి బంగారు భవిష్యత్తుకు పదో తరగతే పునాది అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశమై, రక్షణ, భద్రత చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. ఎంఈవో సత్యవతి, హెచ్‌ఎం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూములు ఆక్రమించిన వారిని శిక్షించాలి

రామభద్రపురం: మండలపరిధిలోని తారాపురం గ్రామ సరిహద్దులో దేవుడు భూములు ఆక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి వినతిపత్రం అందించారు. గ్రామంలోని చింతాలమ్మ, దేశమ్మతల్లి, బంగారమ్మతల్లులకు పూర్వీకుల నుంచి దేవుడుమాన్యం ఉందని, అయితే ఆ భూములను ఇటీవల కొద్ది మంది ఆక్రమించుకుని సుమారు 58 సెంట్లు తప్పుడు డాక్యుమెంట్‌లతో విక్రయాలు చేశారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. బెవర చిన్నారావు , బెవర చిన్నయ్య, పొట్టంగి తమ్మినాయుడు తదితరులు ఉన్నారు. దీనిపై ఆకుల సులోచనారాణి మాట్లాడుతూ సర్వేయర్‌ను పంపించి విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

మొక్కలతోనే మనుగడ

జామి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం కల్పించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని గొడుకొమ్ము గ్రామంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, పేరునాయుడు, బొగ శివ తదితరులున్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

వరద బాధితులకు విరాళాల సేకరణ

రాజాం రూరల్: విజయవాడ వరద బాధితుల కోసం రాజాం ప్రాంతీయ ప్రెస్‌క్లబ్ సభ్యులు మంగళవారం విరాళాలు సేకరించారు. పట్టణానికి చెందిన న్యాయవాది సంచాన చంద్రి నాయుడు రూ.10వేలు విరాళంగా అందించారు. పట్టణం లోని వ్యాపారులు, పాదచారులు, కార్మికులు, మహిళలు స్పందించి విరాళాలను అందజేశారు. రాజాం జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు భీంపల్లి తిరుపతిరావు, ఉపా ధ్యక్షుడు ముతికి కిశోర్, కార్యదర్శి పెంకి వెంకటరావు, జర్నలిస్టులు యూవీయూ చంద్రశేఖర్, నీలకంఠ యాదవ్, వడ్డాది రాజేష్, చంద్రబాబు నాయుడు, మురళి, సురేష్, టంకాల శ్రీనివాసరావు, శ్రీను, సూర్యనారాయణ, సుంకరపల్లి సతీష్, పురుషోత్తం, శ్రీధర్, జయంత్ తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న న్యాయవాది చంద్రినాయుడు

రక్తహీనత రాకుండా జాగ్రత్తలు

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ వెంగల లక్ష్మి ఆధ్వర్యంలో తల్లులకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, వంటలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

రాజాం: పట్టణంలోని చీపురుపల్లి రోడ్ నిర్మల్ ఆయిల్ మిల్ ప్రాంగణంలో గత నెల 26 నుంచి జరుగుతున్న కృష్ణాష్టమి వేడుకలు మంగళవారం ముగిశాయి. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూజ్ఞాన వేదిక (బొద్దాం) ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు శ్రీకృష్ణుడి నిత్య పూజలు నిర్వహించారు. ఆఖరిరోజు శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. బొద్దాం కమిటీ అధ్యక్షుడు ముల్లు రామినాయుడు, పారంనాయుడు, మోహనరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలి, టీబీఆర్ థియేటర్ రోడ్డులోగల షాపులను సచివాలయాల వార్డు అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు మంగళవారం తనిఖీలు చేశారు. ఓ పాన్ షాపులో నిషేధించిన డిస్పోజబుల్ గ్లాసులు, చికెన్ సెంటరులో పాలిథిన్ కవర్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ రెండు షాపుల యజమానులకు వెయ్యి రూపాయల చొప్పున జరిమానా విధించారు.

గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

విజయనగరం దాసన్నపేట: గురజాడ గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ కోరారు. మంగళవారం గురజాడ కేంద్ర గ్రంథాలయం వద్ద నిరసన చేపట్టి, అనంతరం గ్రంథాలయం ప్రతినిధి లక్ష్మీకి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో సరైన వసతులు లేవన్నారు. తవిటినాయుడు, శ్రీను, కిరణ్‌కుమార్, తరుణ్, నిరుద్యోగులు పాల్గొన్నారు.

విగ్రహాల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని అగ్రహారం వీధి శ్రీఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి, భక్తసమాజం ఆధ్వర్యంలో మంగళవారం మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. స్థానిక ఆలయం దగ్గర బీజేపీ నాయకుడు పుల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు, కమిషనర్ లాలం రామలక్ష్మి, వైస్‌ఛైర్మన్ మురళీకృష్ణ చేతుల మీదుగా భక్తులకు అందజేశారు.

పైడిమాంబకు పుష్పాలంకరణ



విజయనగరం రూరల్: పైడిమాంబకు మంగళవారం వివిధ రకాల పువ్వులతో పుష్పాలంకరణ చేశారు. పైడిమాంబ చదురుగుడి వద్ద హోమం నిర్వహించారు. ఉదయం 6.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం సాధారణ భక్తులకు పైడిమాంబ దర్శనం కల్పించారు. వివిధ రకాల పిండివంటలతో తయారు చేసిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

కొత్తపేటలో వైభవంగా ఉట్ల సంబరం

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేట యాదవవీధిలో కృష్ణజన్మాష్టమి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉట్లు సంబరం వైభవంగా నిర్వహించారు. యువతీ, యువకులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాధాకృష్ణుల, కోలాటం, భజన బృందాలు, మేళతాళాలతో కొత్తపేట కోదండ రామాలయం నుంచి కృష్ణుని ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలి

విజయనగరం రూరల్: గర్భిణులు మంచి ఆహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా విజయనగరం ఐసీడీఎస్ ఐదో సెక్టార్ పరిధిలోని అయ్యన్నపేట ఎస్సీ కాలనీ, మినీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై అందరికీ అవగాహన కల్పిస్తామన్నారు.

జీర్ణకోశ వ్యాధులపై అవగాహన

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని కంటోన్మెంట్‌లో గల చేతన్ గ్యాస్ట్రో లీవర్ సెంటర్లో మంగళవారం ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘ సభ్యులకు జీర్ణకోశ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టరు నరేష్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా వైరల్ హెపటైటీస్ వ్యాధులు ప్రబలుతుంటాయని, బయట ఆహారం తీసుకోవడం వల్ల పచ్చకామెర్లు, కడుపునొప్పి, వాంతులు, డయేరియా వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ఎర్రా ప్రసాద్, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ ఉపాధ్యక్షుడు అల్లాడ త్రినా థరావు, జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, చౌదరి, శ్రీనివాస్, గుప్తా, దివాకర్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

పందుల సంచారాన్ని నిరోధిస్తాం

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని పందుల సంచారాన్ని ఈ నెలఖరులోగా నిరోధించేందుకు కృషి చేస్తామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టరు కొండపల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం పాలాసుపత్రి మస్టర్ పాయింట్ వద్ద పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందుల సంచారం విచ్చలవిడిగా ఉందని, దీనిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. పందుల పెంపకందారులు ఇతర ప్రాంతాలకు తరలించుకోవాలని ఆదేశించారు. ఆలా చేయని పెంపకందారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు టీడీపీ కార్యకర్తల సమావేశం

వంగర: మండల కేంద్రంలో బుధవారం ఉదయం పది గంటలకు టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల తెలుగుదేశం పార్టీ మహిళా కార్యదర్శి ఎల్.ధనలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు మోహనరావు తెలిపారు. నామినేటెడ్ పదవులు, మడ్డువలస రిజర్వాయర్ మత్స్యకార సొసైటీ సభ్యుల ఎన్నికలు, పీఏసీఎస్, మహిళాసమస్యపై సమావేశంలో తీర్మాణం చేయనున్నట్లు వివరించారు. గౌరవ అధ్యక్షుడిగా కృష్ణమూర్తి వ్యవహరిస్తారన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

శృంగవరపుకోట: రానున్న తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ఈనెల 5,6 తేదీల్లో యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అంబేడ్కర్ సూచించినట్లు శృంగవరపుకోట తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈమేరకు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ జరిగిందన్నారు. మండలంలో అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని ఆమె కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

లక్కవరపుకోట: మండలంలోని కల్లేపల్లి-రేగ జడ్పీ హైస్కూల్లో మంగళవారం సుమారు 250 మందికి పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సోమవారం విద్యార్థులకు పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయాల్సి ఉంది. తుఫాన్ కారణంగా పాఠశాలకు సెలవు ప్రకటించడంతో వీలుకాలేదని జనసేన-టీడీపీ నేతలు తెలిపారు. వీరమహిళ ఇర్ర వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు జె.కన్నబాబు, పాఠశాల ఛైర్మన్ బి.అక్కునాయుడుల చేతులమీదుగా వీటిని మంగళవారం పంపిణీ చేశారు.

విత్తనశుద్ధి ఎంతో కీలకం

శృంగవరపుకోట రూరల్: వరిసాగుచేస్తున్న రైతులు ప్రతి ఒక్కరూ విత్తనశుద్ధిపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని వసి గ్రామంలో రైతులకు విత్తనశుద్ధి, లైన్‌షోయింగ్, కాలిబాటల గురించి వివ రించారు. వీపీఏ రవి, సత్యనారాయణ తదితరులున్నారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

● గ్రామాల్లో ర్యాలీలు
● వైద్యాధికారులకు వినతి పత్రాలు


బొబ్బిలి: వైద్యాధికారికి వినతిపత్రమిస్తున్న ఆశాలు



ఎస్‌కోట రూరల్: వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

బెల్లం ఊట ధ్వంసం

వంగర: మండలంలోని వీవీఆర్ పేటలో మంగళవారం ఎస్సై షేక్ శంకర్ సిబ్బందితో మెరుపుదాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామస్థులు ఇచ్చిన పక్కా సమాచారంతో దాడులు చేసి నాగావళి తీరంలో ఉన్న బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తయారీ నేరమని ఎవరైనా తయారుచేసి పట్టుబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


బెల్లం ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంతలో ఆటో చోరీ

జామి: మండలంలోని అలమండ సంత వద్ద పట్టపగలే ఆటో చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట గ్రామానికి చెందిన లంక గోపీ మంగళవారం అలమండ వైపు తన ఆటోతో వెళ్తున్నాడు. అలా వస్తూ సంతవద్ద ఆటో ఆపి పశువులకు కన్నె(తాడు) కొందామని సంతలోపలకి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా తాను పెట్టిన చోట ఆటో కనిపించలేదు. చూట్టుపక్కల పూర్తిగా వెతికిన ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడు అదృశ్యం

రేగిడి: మండలంలో బాలికావలసకు చెందిన వృద్ధుడు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనికి సంబంధించి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొడిశ సూర్యనారాయణ(75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గత నెల 24న వైద్యంకోసం రాజాం ఆసుపత్రికి వెళ్తానని భార్య జగ్గమ్మకు చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఆరోజు రాత్రివరకు ఇంటికి చేరుకోకపోవడంతో అప్పటి నుంచి కుటుంబీకులు అన్నిచోట్లా వెతికారు. కుమారుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేగిడి పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాలూరు మున్సిపాల్టీలో భారీగా బదిలీలు

సాలూరు: సాలూరు మున్సిపాల్టీలో భారీగా బదిలీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.ప్రసన్నవాణిని విశాఖపట్నం జీవీఎంసీకి బదిలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పకీర్‌రాజును పార్వతీపురం మున్సిపాల్టీకి బదిలీ చేశారు. మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాఘవాచార్యులను బొబ్బిలికి, బొబ్బిలి మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న శివప్రసాద్‌ను సాలూరుకు బదిలీ చేశారు. రెవెన్యూ ఆఫీసర్‌గా పి.ప్రసాద్‌రావు బొబ్బిలి మున్సిపాల్టీ నుంచి సాలూరుకు రానున్నారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అహ్మద్ బొబ్బిలికి వెళ్లనున్నారు. అలాగే జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న బేగం, ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పాపయ్యరాజు బొబ్బిలికి బదిలీపై వెళ్లనున్నారు. బొబ్బిలి మున్సిపాల్టీలో సినియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అప్పలనరసమ్మ సాలూరుకు రానున్నారు. సీహెచ్.రామారావు, గణపతి, సింహాచలం బిల్‌కలెక్టర్లు బొబ్బిలి నుంచి సాలూరు మున్సిపాల్టీకి రానున్నారు. పార్వతీపురం మున్సిపాల్టీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణరావు బదిలీపై సాలూరు రానున్నారు. ఇక్కడ ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు పలాస మున్సిపాల్టీకి బదిలీ జరిగింది. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తున్న ఎంవీ రమణకు డెప్యూటేషన్‌పై నెలిమర్లకు బదిలీ చేశారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

రాజాం రూరల్: తన భర్త ఉణుకూరు రాము కనిపించడం లేదంటూ మున్సిపాలిటీ పరిధిలోని సారధి గ్రామానికి చెందిన జ్యోత్స్న మంగళవారం రాత్రి రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్న కారణంగా గతనెల 21న రాజాం వెళ్లి వస్తానని చెప్పి నేటి వరకూ రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ భాస్కర్రావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయాలు జవాబుదారిగా ఉండాలి

రాజాం: సచివాలయాలు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు అన్నారు. ఆగూరు సచివాలయాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం పంచాయతీ శానిటేషన్, తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శి, సిబ్బందితో సమీక్షించారు.

విరాళాలు అందజేయాలి

రాజాం: రాష్ట్రంలోని వరద బాధితులకు దాతలు విరాళాలు అందించాలని రాజాం వికాశ తరంగణి ప్రతినిధి టీటీవీ రమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక వికాశ తరంగణి కార్యాలయంలో మంగళవారం రాజాం పట్టణ స్వచ్ఛంద సేవాసంస్థల ప్రతినిధులు సమావేశమయ్యారు. విరాళాల సేకరణకు కార్యాచరణ రూపొందించారు. వరద బాధితులకు సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాజాం రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ కొత్త సాయి ప్రశాంత్‌కుమార్, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అచ్యుత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహిత పెంకి చైతన్యకుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు మక్క అప్పలనాయుడు, గట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకపోతే ఊపేక్షించం

విజయనగరం రింగురోడ్డు: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. మంగళవారం వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణపనులను ఆయన స్వయంగా పరిశీలించారు. నిర్మాణదశలో ఉన్న కాలువలు, కల్వర్టులు, రహదారుల మరమ్మతు పనులు ఇత్యాది అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నెహ్రూ పార్కులో ఏర్పాటు చేసిన బోర్‌ని పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులతో కలిసి పనుల పరిస్థితిని గమనించి సూచనలు చేశారు. ఈఈ శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, ఏఈ వెంకటేశ్వరరావు, పార్వతీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడదాం

బొబ్బిలి రూరల్: పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని బొబ్బిలి గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి అన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావుని మంగళవారం కలసి మట్టి వినాయక విగ్రహాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా వినాయక చవితికి మట్టి ప్రతిమలను ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్‌బెల్ట్ సభ్యులు బాల భాస్కరరావు, కృష్ణదాసు, చెలికాని కేశవ, బి.సత్యనారాయణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలి

బొబ్బిలి రూరల్: తాగునీటి ట్యాంకులను నెలకొకసారి శుభ్రం చేయాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. మండలంలోని జగన్నాథపురం, కృష్ణాపురం గ్రామాల్లో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగు నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. సర్పంచ్ బి.పద్మ, గంట సింహాచలం, ఎంపీడీసీ సభ్యుడు రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలి

రాజాం: ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలని డీడీఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఆశా డే సందర్భంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నేత్రదాన చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలిగించాలన్నారు.

వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న రామ్‌మల్లిక్ నాయుడు

గరివిడి: ప్రజలకు వైద్యాధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. బండపల్లి పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైల బలరాం, మండల టీడీపీ నేతలు సారిపాక సురేష్‌కుమార్, వెంపడాపు రమణమూర్తి, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

చీపురుపల్లి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా చీపురుపల్లిలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతి ప్రదానం చేశారు. వంగపల్లిపేటకు చెందిన ముల్లు చేతన, గొర్లె చందులు ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సౌదామిని, ఉపాధ్యాయులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ఎస్.బలరాం, జి.జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో క్లిష్టమైన శస్త్రచికిత్స

నెల్లిమర్ల: ఇక్కడి మిమ్స్ జనరల్ ఆసుపత్రిలో వైద్యులు వెన్నెముకకు సంబంధించి క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. కె.వరాలమ్మ(70) ఏళ్ల వృద్ధురాలు పడిపోవడంతో మెడ వెనుక భాగంలో ఉన్న వెన్నెముక దెబ్బతింది. మెడనొప్పితో పాటు కాళ్లు, చేతులు చచ్చుబడిపోయే స్థితికి చేరుకుంది. కుర్చీకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఆమె మిమ్స్ ఆసుపత్రిలో చేరింది. సంబంధిత వైద్యులు క్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ఫలితంగా ఆ వృద్ధురాలు ఇప్పుడు వాకర్ సాయంతో నడవగలుగుతోంది. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ చికిత్సను వైద్యులు డాక్టర్ స్రవంత్ కొట్టా, డాక్టర్ ఈశ్వరరావు, డాక్టర్ టి.యశ్వంత్ తదితరులు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.01 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

చీపురుపల్లి: చీపురుపల్లిలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం కోసం పట్టణానికి చెందిన పక్కి శ్రీరామ సతీష్, అర్చన దంపతులు రూ.1.1 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమ తండ్రి పక్కి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని ఇస్తున్నట్టు వారు తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు ఎస్వీజీ శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణు, అప్పికొండ ఆదిబాబు, దాసరి రవిలకు ఈ మొత్తాన్ని వారు అందజేశారు.

చిరుధాన్యాలతో ఎంతో మేలు

గజపతినగరం: చిరుధాన్యాలతో మంచి పోషక విలువలు కలిగిన ఆహారం లభిస్తుందని..ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఐసీడీఎస్ పీఓ నాగమణి అన్నారు. మంగళవారం పాతబగ్గాం అంగన్వాడీ కేంద్రం-2లో పోషణ మహోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాల్లో ఐరన్, కాల్షియం, పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లెంక పద్మావతి, ఎంపీటీసీ పప్పల అప్పయ్యమ్మ, సూపర్ వైజర్ శకుంతల, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే చెల్లించండి



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

గజపతినగరం: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిషోర్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 19 నెలలుగా గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొన్ని గ్రామాల్లో 6 నెలల బకాయిలు ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఎంపీడీఓ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంవత్సరం నిధులతో వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబాసిడర్‌ల మండల అధ్యక్షులు అప్పన్న, కార్యదర్శి కె.రాము, శీను, సీతయ్య, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 74 మంది ఎంపిక

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 74 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.వీవీ కృష్ణాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్, హెటిరో, ఆస్పిరాయ్ టెక్నాలజీస్, వే టు న్యూస్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని వివరించారు. 176 మంది అభ్యర్థులు హాజరు కాగా, వీరిలో 74 మంది ఉద్యోగాలు పొందినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్ కుమార్, జేకేసీ కోఆర్డినేటర్ కె.ఉషాజ్యోతి, జేకేసీ మెంటార్ అమర్‌లింగం, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడి రిజర్వాయర్ పరిశీలన



వసంత గెడ్డను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

గంట్యాడ: ఇటీవల కురిసిన వర్షాలతో వాగులు, గెడ్డలకు వస్తున్న వరద నీటిని మండల టీడీపీ నాయకులు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వసంత గెడ్డతో పాటు, తాటిపూడి రిజర్వాయర్‌ను పరిశీలించారు. గెడ్డలోకి నీరు అధికంగా వచ్చే సమయంలో పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయుకులు కొండపల్లి భాస్కర్ నాయుడు, జి.శ్రీనివాసరావు, ఆర్.రామునాయుడులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

చీపురుపల్లి: మత్తు పదార్థాల నివారణపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంఘ ప్రతినిధులు జె.రవికుమార్, ఎం.వెంకీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని మూడు రోడ్ల కూడలిలో ప్రదర్శన నిర్వహించారు. డ్రగ్స్ నివారణపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు విజయనగరంలోని గురజాడ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డేదీ?

- పట్టించుకోని అధికారులు
- పగలూ రాత్రీ తేడా లేకుండా తరలింపు



లింగాలవలస గెడ్డ నుంచి ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

గజపతినగరం: ప్రభుత్వం ఇసుక రవాణాకు సంబంధించి ఎన్ని విధానాలను అమలులోకి తీసుకువచ్చినా అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. మండలంలోని చంపావతి, ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. లింగాలవలసలో గలఏడొంపుల గెడ్డ నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారు. గతంలో దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వివిధ గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక కోసం ప్రజలు ప్రయత్నిస్తే అధికారులు కొర్రీలు వేస్తున్నారని.. కానీ అక్రమంగా తరలిపోతున్నా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

- తుమ్మికాపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న ఏటి జోరు నుంచి అక్రమంగా ఇసుకను తరలించుకుపోతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 117లో ఎన్నో ఏళ్లనుంచి ఏటి జోరులో అక్రమంగా ఇసుకను తరలించుకుపోవడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం, తగరపువలస, విశాఖపట్టణాలకు తరలిస్తున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడంతో అడ్డుకట్ట పడడం లేదని అంటున్నారు.
- ఎం.గుమడాం గ్రామంలో గల ఏడొంపుల గెడ్డ నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని, దీని వల్ల మోటారు బావులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో సాగునీరు , తాగునీటికి తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపావతి నది వంతెన నుంచి గంగచోళ్లపెంట, పురిటిపెంట, తుమ్మికాపల్లి, కెంగువ గ్రామాల పరిధిలో యథేచ్ఛగా ఇసుక తరలిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ కె.లక్ష్మణరావును వివరణ కోరగా అక్రమంగా ఇసుక రవాణా జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

కెరటాం వీఆర్వోపై చర్యలు తీసుకోండి

బొండపల్లి: 'భూ రీసర్వేలో మా సాగు హక్కులో ఉన్న భూములను మా పేరు మీద కాకుండా 1బి, అడంగల్ వేరొకరి పేరున మార్చిన కెరటాం వీఆర్వో ఎస్.దివ్యప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాల'ని నెలివాడ గ్రామానికి చెందిన బడిబట్ల బాలాజీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కెరటాం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 79-5లో 8 ఎకరాల మెట్ట భూమి తమ తండ్రి బడిబట్ల లక్ష్మంనాయుడు పేరున ఉందని బాలాజీ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ భూమిని పదేళ్ల కిందట మరణించిన బడిబట్ల అప్పలసన్యాసమ్మ పేరున రీ-సర్వేలో వీఆర్వో మార్పు చేశారని ఆయన అన్నారు. ఈ విషయమై వీఆర్వో దివ్యప్రభాకర్‌ను అడగగా పొరపాటు జరిగిందని, సమస్య పరిష్కరిస్తానని సమాధానం చెప్పారని, అయినా నేటివరకు పట్టించుకోలేదని బాలాజీ తెలిపారు. వీఆర్వో వేరొకరి దగ్గర డబ్బు తీసుకొని రికార్డులు మార్చారని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాలాజీ కోరారు. దీనిపై తహసీల్దార్ డి.రాజేశ్వరరావును వివరణ కోరగా వీఆర్వో దివ్య ప్రభాకర్‌పై విచారణ జరిపి నివేదిక ఆధారంగా తగు చర్యలు తీసుంటామన్నారు.

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న రవిశేఖర్

నెల్లిమర్ల:కొండవెలగాడ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆకాంక్షించారు. అనకాపల్లిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు ఛాంపియన్‌షిప్ సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, కోచ్ చల్లా రాము మంగళవారం రవిశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రవిశేఖర్ మాట్లాడుతూ కొండవెలగాడ క్రీడాకారులకు ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కీర్తిప్రతిష్టలు ఉన్నాయని అన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి, సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు.

తీరంలో ప్రత్యేక నిఘా:డీఎస్పీ



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీరప్రాంత గ్రామాల నుంచి జాతీయ రహదారికి చేరే మార్గాలపై ప్రత్యేక నిఘా ఉంచి సాగర్ కవచ్ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం సాగర్ కవచ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడితే పట్టుకోవాలన్నారు. భోగాపురం మండలం దిబ్బలపాలెం నుంచి పూసపాటిరేగ మండలం చింతపల్లి వరకు నిఘా ఉంచాలన్నారు. ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించడం, చేయి చేసుకోవడం వంటివి చేయకూడదన్నారు. సముద్ర మార్గం నుంచి జాతీయ రహదారిని, ప్రధాన రహదారులను కలిసే అన్ని మార్గాల్లో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాగర్ కవచ్‌లో 199 మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగాపురం సీఐ ఎన్వీ ప్రభాకరరావు, మెరైన్ సీఐ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఈ-పంట నమోదు



దత్తిరాజేరులో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న మహరాజన్

చీపురుపల్లి: ఈ నెల 15లోగా రైతులు ఈ పంట నమోదును పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వీటీ రామారావు సూచించారు. పేరిపిలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ ఎస్.కోటేశ్వరరావు, ఏఓ సీహెచ్. రఘునాథ్, వీహెచ్‌ఏ ఆర్.సోనియా పాల్గొన్నారు.

దత్తిరాజేరు: వ్యవసాయ సహాయ సంచాలకులు మహరాజన్ మంగళవారం మండలంలోని పోరలి, బూర్జవలస, దత్తి, ఆర్.రామచంద్రాపురం, పాచలవలస, పెదకాద గ్రామాల్లో పర్యటించి ఈ-పంట నమోదును పరిశీలించారు. దీని ప్రాముఖ్యాన్ని రైతులకు వివరించారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, గజపతినగరం టెక్నికల్ ఏవో లోకేష్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి: ఆర్డీవో



దాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: విద్యార్థులు, యువత కనీసం ఆరునెలలకోసారి రక్తదానం చేయాలని ఆర్డీఓ బి.శాంతి అన్నారు. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చీపురుపల్లి ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రక్తదానం వల్ల దాతల ఆరోగ్యం మెరుగుపడుతుందని, గ్రహీతలకు ప్రాణ దానం జరుగుతుందన్నారు. దీనిపై అపోహలు విడనాడాలని సూచించారు. రక్తదానం చేసిన 29 మంది విద్యార్థులకు ఆమె ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ సమన్వయకర్త టీవీ గోవిందరాజులు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గవిడి నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వే గేటు

గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం



గేటు వద్ద నిలిచిన వాహనాలు

దత్తిరాజేరు: మానాపురం రైల్వే గేటు మొరాయించడంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అలాగే భారీ లారీ ఇంజన్ మరమ్మతులకు గురి కావడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం కలిగింది. వాహన చోదకులు, ప్రయాణికుల సహనాన్ని పరీక్షించాయి. రెండువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇక్కడ తలపెట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందోనని ప్రజలు నిష్టూరుస్తున్నారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రైల్వేగేటు కష్టాలు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయాలి



బొబ్బిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ కార్యకర్తలు

బొబ్బిలి: ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం బొబ్బిలి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ కేవలం నాసిరకం బియ్యం మాత్రమే ఇచ్చి ప్రభుత్వాలు చేతులు దులుపుకుంటున్నా యని ఆరోపించారు. నిత్యావసరాలతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, ఆహారభద్రతా చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, వై.బాబ్జీ, నారాయణ, తులసి, బి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి పనులపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

లక్కవరపుకోట: బాబూ జగ్జీవన్‌రాం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఎడమ కాలువ పనులపై మంగళవారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు ప్యాకేజ్ 2 కింద భూసేకరణ, స్థల పరిశీలనపై రైతులు, అధికారులతో మాట్లాడారు. సుజల స్రవంతి పనుల ద్వారా ప్రజలకు అవసరమైన నీటిని త్వరగా అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారులకు ప్రాజెక్టు రిపోర్టు సమర్పించి పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.మురళీకృష్ణ, స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, మల్లునాయుడు, జీఎస్.నాయుడు పాల్గొన్నారు.

పురపాలక సేవలను మెరుగుపరచాలి: సీపీఎం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ సేవలను మెరుగుపరచాలని సీపీఎం నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు.. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పాలకవర్గం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పౌరసేవలు మాత్రం మెరుగుపడడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందన్నారు. పలు వార్డులకు సరఫరా చేస్తున్న తాగునీరు దుర్వాసన వస్తోందని తెలిపారు. అందులో పురుగులు ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరేళ్ల అవుతున్నా సువర్ణముఖి పథకానికి అతీగతీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. తాగునీటిని రెండురోజులకోసారి ఇస్తున్నారని, వీధి దీపాల సమస్య చాలా తీవ్రంగా ఉందని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మరీ అధ్వానంగా ఉందన్నారు. ప్రజల నుంచి ముక్కుపిండి అన్ని పన్నులను వసూలు చేస్తున్నారని, అందుకు తగ్గట్టుగా సేవలు మాత్రం అందించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సక్రమంగా సేవలు అందించాలని, లేదంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు గౌరి, వెంకటి, శివ, ఏడుకొండలు పాల్గొన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

భోగాపురం: తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దివీస్ పరిశ్రమ యాజమాన్యం మంగళవారం సాఫ్ట్‌బాల్ క్రీడా పరికరాలు అందజేసినట్లు హెచ్‌ఎం వి.అప్పన్న తెలిపారు. సుమారు రూ.2.25 లక్షల విలువ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజ్‌మెంట్ సురేష్, పీడీ సూర్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం వ్యాధి నియంత్రణే లక్ష్యం

రామభద్రపురం: శతశాతం వ్యాధి నియంత్రణే లక్ష్యమని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐవో) అచ్యుతకుమారి అన్నారు. మండలంలోని రామభద్రపురం, ఆరికతోట పీహెచ్‌సీలను మంగళవారం ఆమె సందర్శించారు. పీహెచ్‌సీలలో వ్యాధినిరోధక టీకాలు సరఫరా అవుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల పరిధిలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాక్సినేషన్‌పై దిశా నిర్దేశం చేశారు. వైద్యాధికారులు పి.దిలీప్‌కుమార్, ఏఎల్‌జీ శిరీష, రత్నదీపక్, హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.